పుష్కల జలం

- దాహం తీరుస్తోన్న మింది గుడివాడ అప్పన్న కాలనీలోని నీటి శుద్ధి కేంద్రం
- ప్రజలు, పరిశ్రమల నీటి అవసరాలకు ప్రాధాన్యం

అక్కిరెడ్డిపాలెం: మింది గుడివాడ అప్పన్న కాలనీలో ఏర్పాటైన తాగునీటి శుద్ధి కేంద్రం ప్రజలు, పరిశ్రమల నీటి అవసరాలు తీరుస్తోంది. ఇక్కడ రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించిన క్లారిఫైడ్ వాటర్ ప్లాంట్ ద్వారా సుమారు 8 పరిశ్రమలకు 4.5 గ్యాలన్ల నీరు అందుతోంది.

నిత్యం వాటర్ సప్లై ఏఈ పర్యవేక్షణలో రెండు విభాగాల్లో సిబ్బంది తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పర్యవేక్షిస్తుంటారు. మేఘాద్రిగెడ్డ నుంచి నాతయ్యపాలెం పంప్ హౌస్, అక్కడి నుంచి మింది గుడివాడ అప్పన్న కాలనీలో గల తాగునీటి శుద్ధి కేంద్రానికి మంచినీరు సరఫరా అవుతోంది. అక్కడ గల 11 బెర్త్‌ల ద్వారా నీటిలో ఉన్న మలినాలను శుద్ధి చేసి అనంతరం పారిశ్రామిక ప్రాంత ప్రజల అవసరాలకు సరఫరా జరుగుతోంది.

నివాస ప్రాంతాలు.. పరిశ్రమలకు..

మింది ఫిల్టరైజేషన్ ప్లాంట్ నుంచి మింది, రాంనగర్, కాశికానగర్, గుడివాడ అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలకు నీరు నిరంతరాయంగా సరఫరా అవుతోంది. హిందుస్తాన్ షిప్‌యార్డు, కోరమాండల్ లిమిటెడ్, ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, అలూ ఫ్లోరైడ్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్, విశాఖ డెయిరీ, ఐఎన్ఎస్ ఏకశిల, విశాఖ వైర్స్ అండ్ రోప్స్ వంటి పరిశ్రమలకు ఇక్కడి నుంచే బల్క్‌గా నీటిని సరఫరా చేస్తారు. ఈ విధంగా సేవలందిస్తున్న తాగునీటి శుద్ధి కేంద్రం సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


క్లారిఫైడ్ వాటర్ ప్లాంట్


మేఘాద్రి గెడ్డ నుంచి వచ్చిన నీటిని శుద్ధి చేస్తున్న ఎంజీఆర్ వాటర్ సప్లై ట్యాంక్

వైఎస్సార్‌సీపీతోనే సమస్యల పరిష్కారం

అగనంపూడి: సమస్యలు పరిష్కరించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 85వ వార్డులోని అగనంపూడి పశు వైద్యశాలకు ఇటీవల స్థలం కేటాయించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి చొరవతో కలెక్టర్ స్పందించి ప్రస్తుతం ఆస్పత్రి ఉన్న చోటనే స్థలం కేటాయించారు. ఈ మేరకు అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఎమ్మెల్యే నాగిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదు వార్డులకు సంబంధించి పశువైద్యశాల అగనంపూడిలో ఉందని, వందలాది మంది నిర్వాసిత రైతులు ఉపాధి లేక పాడి పశువులపై జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరించడంతో సత్వరం స్పందించిన ఆయన స్థలం కేటాయించారన్నారు. ఏళ్ల నుంచి పశు వైద్యశాలకు పక్కా భవనం కావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారని, సమస్య కొలిక్కి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణ బాబు, పిళ్లా కొండలరావు, బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, దాసరి సత్య వేణి, పిళ్లా రవి, యలమంచిలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

రామాయణ పుస్తకాల పంపిణీ


పాఠకులకు పుస్తకాలు అందిస్తున్న రాఘవాచార్యులు

గాజువాక: సాహిత్య సుధ అధ్యక్షుడు, రచయిత అద్దంకి రాఘవాచార్యులు రచించిన రామాయణ రసరమ్య సమీక్షలు, వచన కావ్య పుస్తకాలను గాజువాక శాఖా గ్రంథాలయంలో పాఠకులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవాచార్యులు మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని 18 వ్యాసాలుగా రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విట్‌లో చేరిన ఇంటర్ జిల్లా టాపర్ సాయిహర్షిణి


విజయవాడలోని విట్‌లో ఉచిత అడ్మిషన్ ఫామ్ అందుకుంటున్న సాయి హర్షిణి

అగనంపూడి: మార్చిలో నిర్వహించిన ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచిన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని దేవరకొండ సాయి హర్షిణి విజయవాడలోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(విట్) ఆఫర్ మేరకు బీటెక్‌లో చేరింది. జిల్లా టాపర్‌గా నిలవడంతో విట్ ఉచితంగా చదివించేందుకు హర్షిణికి అవకాశం కల్పించింది. ఈ మేరకు గురువారం ఆమె విట్‌లో సీఎస్ఈ బ్రాంచ్‌లో చేరినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ తెలిపారు.

ఉక్కునగరం క్వార్టర్స్‌లో పాము హల్‌చల్


పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–6లోని క్వార్టర్స్‌లో ఓ పాము నివాసులను భయాందోళనలకు గురిచేసింది. గురువారం సెక్టార్–6లోని 410బీ క్వార్టర్స్‌లో నివసిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుటుంబీకులు గదిలో నక్కి ఉన్న పామును చూసి బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు కూడా ఆందోళన చెందారు. వెంటనే స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన వచ్చి నక్కి ఉన్న పామును ఒడిసి పట్టుకున్నారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పామును ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తానని కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రపంచ శాంతిపై 20న సదస్సు

మద్దిలపాలెం : డాక్టర్ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రీలిజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి అంశంపై సదస్సు జరగనుందని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే వారు ముందుగా 90324 77463 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

50 మందికి కంటి పరీక్షలు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 60 ఏళ్లు దాటిన వారికి కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 50 మందికి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. నగరంలోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి సిబ్బంది కె.భవాని పరీక్షలు నిర్వహించారు. 523 సచివాలయ హెల్త్ సెక్రటరీ కె.షైలా బేగం, వలంటీర్లు టి.సరోజ, కె.పవన్ కుమార్, ఎస్.ధనలక్ష్మి, కె.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే పరమావధిగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు డాక్‌యార్డ్ కాలనీ సచివాలయ పరిధి రాజీవ్‌నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న హామీలను పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం భారీ మెజారిటీతో గెలిచి, మరెన్నో సంక్షేమ పథకాలతో చరిత్ర తిరగరాసే స్థాయికి జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉండబోతుందన్నారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్, శ్రీనివాస్ పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, యోహాన్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, గుండాసు రాజు, దుర్గారావు, సరేంద్ర, బాలకృష్ణ, వరలక్ష్మి, రాజు సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, పోలీస్ శాఖ, ఎలక్ట్రికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: వడ్లపూడి పరిధి విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ వుడా ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ముఖ్యంగా 11 కేవీ వుడా ఫీడర్‌లోని సైమాన్‌నగర్, మాతృశ్రీనగర్, ఫీకర్‌టకియా, వుడా ఫేస్–2,5,7 ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

కూర్మన్నపాలెం పరిధిలో..

కూర్మన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ కెబీఆర్ ఎయిర్ ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. శాతవాహననగర్ రోడ్ నంబర్1–9, శివాజీనగర్, ఆల్ ఇండియా రేడియో, గౌరీనగర్, శివశివానీనగర్, శాతవాహన నగర్ రోడ్ నంబర్–9, యాతపాలెం, ముస్తఫా జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

ఆరుగురు విద్యార్థులకు అవార్డులు


అవార్డులు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం కాంతం, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ భావ ప్రకటన(చిత్రాలకు) అవార్డులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా గురువారం వీరిని పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు అభినందించారు. సీనియర్ విభాగంలో ఫలక్ నాజ్, పి.మురళి, బి.చంద్రకళ, జూనియర్ విభాగంలో సీహెచ్ హర్షవర్ధన్, కె.పావని, కె.సందీప్‌లు స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా జీవీఎంసీ నిర్వహించిన ఎకో వైజాగ్ కిడ్స్ ఆర్ట్స్ కాంటెస్ట్‌లో 6 చిత్రాలను ఎంపిక చేశారు. విద్యార్థులు వేసిన చిత్రాలు నగర పరిధిలోని గోడలపై జీవీఎంసీ వారు ప్రదర్శిస్తారు. ప్లాస్టిక్ రహిత విశాఖ, క్లీన్ విశాఖ, పొల్యూషన్ రహిత విశాఖకు సంబంధించిన చిత్రాలను ఈ విద్యార్థులు వేశారు. పాఠశాల డ్రాయింగ్ టీచర్ బి.రవిచంద్, ఉపాధ్యాయులు కుమార స్వామి, దేముళ్లు అవార్డులు విద్యార్థులను అభినందించారు.

కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఐ బస్సుయాత్ర

కూర్మన్నపాలెం: నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌తోపాటు ఇతర ప్రభుత్వ రంగం సంస్థలను కాపాడుకుందామని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను గురువారం కూర్మన్నపాలెం ఉక్కు దీక్ష శిబిరం వద్ద ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. లాభాలను ఆర్జిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా ధారాదత్తం చేయాలనుకోవడం అన్యాయమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్రజల్లో ఉక్కు ఉద్యమంపై చైతన్యం కలిగిస్తూ ప్రారంభమైన బస్సుయాత్ర.. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగించి సెప్టెంబర్ 8న తిరుపతిలో జరిగే భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. సీపీఐ ప్రచార జాతా–బస్సుయాత్రకు అడుగడుగునా స్వాగతం పలికి జయప్రదం చేయాలని ప్రజలను అమర్‌జిత్ కౌర్ కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జె.వి.సత్యానరాయణ మూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఓబులేసు, ఆర్.రవీంద్రనాథ్, అక్కినేని వనజ, జిల్లా సీపీఐ కార్యదర్శి ఎం.పైడిరాజు, గుర్తింపు యూనియన్ అదనపు కార్యదర్శి జె.రామకృష్ణ, సీపీఐ ఫ్లోర్ లీడర్ స్టాలిన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నర్సింగరావు, జె.అయోధ్యరామ్, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రాజబాబు, ఉక్కునగరం సీపీఐ కార్యదర్శి తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.రాజబాబు, రాష్ట్ర యువజన సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటం


917వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న సీపీఐ నాయకులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోరాడాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 917వ రోజుకు చేరుకున్నాయి. సీపీఐ నాయకులు పాల్గొని కార్మికులు చేస్తున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ జోలికి వస్తే కార్మికులు, నిర్వాసితులు, రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దీక్షలు చేపట్టి 917 రోజులు గడుస్తున్నా.. కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కొనడానికి ఎవ్వరూ వచ్చినా అడ్డుకుంటామని, పోరాటలు, ప్రాణత్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఎంతోమంది నాయకులు, అమరవీరులు త్యాగం ముడిపడి ఉందని, నిర్వాసితులు తమ విలువైన భూములను త్యాగం చేశారని, అటువంటి పరిశ్రమను అమ్మితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని చిన నడుపూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయ దశమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఇందల ఈశ్వరరావు, జె. రామునాయుడు, నాగిరెడ్డి పెద వెంకటరమణ, నాగిరెడ్డి రాంబాబు, బొండా అప్పారావు, సీతిన నరసింగరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఫార్మా కళాశాలకు నాక్ ఏ++ గ్రేడ్

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ కళాశాల నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను దక్కించుకుంది. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(నాక్) స్టాండింగ్ కమిటీ కళాశాలలో వివిధ అంశాలను పరిగణలోకి తీసుకుని ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్‌కు ఎంపిక చేసినట్లు సంస్థ సీఈవో శ్రీకాంత్, ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తెలిపారు. విజ్ఞాన్ కళాశాల నాలుగు పాయింట్లకు 3.56 స్కోర్‌తో దేశంలోనే రెండవ అన్‌ఎయిడెడ్ ఫార్మసీ కళాశాలగా గుర్తింపు పొందిందని వారు పేర్కొన్నారు. నాక్ స్టాండింగ్ కమిటీ ప్రతినిధులు గత నెలలో కళాశాలను సందర్శించి నాణ్యత ప్రమాణాలు, బోధన పద్ధతులు, పరిశోధనలు, ఆవిష్కరణలు, మౌలిక వసతులు, ఉపాధి, అడ్వాన్స్‌డ్ ల్యాబ్స్, అభ్యసన వనరులు, ఇంటర్న్ షిప్, విద్యార్థుల పురోగతి తదితర అంశాలు పరిశీలించి, ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బందిని విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు కృష్ణదేవరాయలు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ కమల కుమారి, బోధన సిబ్బంది, విద్యార్థుల కృషికి తార్కాణం ఈ గుర్తింపు అని పేర్కొన్నారు.


నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడు సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న సీఈఓ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

31న భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు


మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఈ నెల 31న జరగనున్నట్లు రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో 450 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటింగ్ ప్రక్రియ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియను 25వ తేదీన నిర్వహించనున్నారు.

ఇంటక్, సిటూ అలయన్స్ ఫ్రంట్‌ను గెలిపించండి

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 31న జరగనున్న భెల్(హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఫ్రంట్‌ల అలయన్స్‌ను గెలిపించాలని భెల్ హైదరాబాద్ యూనిట్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి కోరారు. ఎన్నికల సందర్భంగా గురువారం సంస్థలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ రెండు యూనియన్లు నిరంతరం కార్మికుల శ్రేయస్సు, హక్కుల కోసం పోరాడుతున్నాయన్నారు. ఈ ఫ్రంట్‌లను గెలిపిస్తే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.ఆనందరావు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడిగా పోటీలో నిలిచిన జి.టి.పి.ప్రకాష్, వి.ఎస్.మూర్తి, కె.విజయ్‌కుమార్, చిట్టిబాబు, పి.ఆనంద్‌కుమార్, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

గైస్ పూర్వ విద్యార్థుల సమావేశం రేపు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1971–1975 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కాలేజీలోని అన్ని బ్రాంచీలకు చెందిన టాపర్లకు ప్రోత్సాహక బహుమతులతోపాటు కాలేజీ ఫైనలియర్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. బ్రాంచీల వారీగా బాలికలు, బాలురుల్లో టాపర్‌తోపాటు కాలేజీ టాపర్స్ రూ.10,000 చొప్పున నగదు బహుమతులను పూర్వ విద్యార్థులు అందజేస్తారని పేర్కొన్నారు.

హెటిరో డ్రగ్స్‌లో ఉద్యోగాలకు 21న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 21న స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు, 2019–2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి 26 ఏళ్ల లోపు వయస్సుగల అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2.70 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, గుర్తింపు కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

వైభవంగా అప్పన్నకు పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శత నామావళి పూజ చేస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అప్పన్నకు గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఆరు లైన్ల రహదారిగా విస్తరించాలి

అగనంపూడి: రెండున్నర దశాబ్దాలుగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అగనంపూడి టోల్‌ప్లాజాను వెంటనే తొలగించాలని, దివాన్ చెరువు నుంచి అనకాపల్లి వరకు ఆరు లైన్లుగా జాతీయ రహదారి విస్తరించాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయాధికారి ఆర్.కె.సింగ్‌ను ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోటీదారు గుండుపల్లి సతీష్ వినతిపత్రంలో కోరారు. విజయవాడలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో ఆయన్ని కలిసిన సతీష్ వినతిపత్రం అందించారు. జాతీయ రహదారిపై ప్రయాణికులకు వీలుగా దారి పొడవునా నిర్దేశిత ప్రాంతాలను తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేయించాలని, రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా స్పెషిఫికేషన్లు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న రహదారిలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయినందున దివాన్ చెరువు నుంచి అనకాపల్లి వరకు రహదారి విస్తరించాలని కోరారు.


ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్.కె.సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సతీష్

అందరికీ చేరువలో ఆయుర్వేద సేవలు

ఏయూ క్యాంపస్: ప్రజలందరికీ ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్నట్టు ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ తెలిపారు. యోగా విలేజ్‌లో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కేజీహెచ్‌లో సుదీర్ఘ కాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ రోగులను పరీక్షించి అవసరమైన ఔషధాలు సూచించారు. గతేడాది డిసెంబర్ నుంచి ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఇప్పటి వరకు 230 మందకిపైగా సేవలు వినియోగించుకున్నారని భానుకుమార్ చెప్పారు. ఇప్పటి వరకు 32 శాతం ఆర్థరైటిస్, 20 శాతం జీర్ణకోశ సంబంధ, 16 శాతం చర్మ సంబంధ, 15 శాతం మానసిక సంబంధ సమస్యలకు చికిత్స అందించామన్నారు.

బీఐఎస్ అవగాహన ఒప్పందం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను రెండు సంస్థల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ వేదుల సాయికృష్ణ సంతకాలు చేశారు. రెండు సంస్థలు సంయుక్తంగా సదస్సులు, వర్క్ షాప్‌లు, సింపోజియంలను నిర్వహించనున్నాయి. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంల నిర్వహణ, భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే దిశగా నిర్ణయం తీసుకున్నారు. స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు, విద్యా సంబంధిత తరగతులను సంయుక్తంగా నిర్వహించనున్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు